
స్టేషన్ నిర్వహణ పట్టదా?

ఆదాయం ఘనం.. వసతులు పూజ్యం ఇదీ దువ్వాడ రైల్వేస్టేషన్ పరిస్థితి. విశాఖకు సమాంతరంగా దువ్వాడ రైల్వేస్టేషన్‌ను తీర్చిదిద్దాలని రైల్వే ఉన్నతాధికారులు భావిస్తున్నా.. ఇక్కడి అధికారుల నిర్లక్ష్యం, నిర్లిప్తత వల్ల స్టేషన్ అధ్వానంగా మారుతోంది. ఆవరణ నిర్వహణను గాలికి వదిలేశారు. పరిసరాలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. తాగునీటి కుళాయిల చుట్టూ అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. - అగనంపూడి

- దువ్వాడ రైల్వేస్టేషన్ బాగోగులు పట్టించుకోని అధికారులు
- చెత్తా చెదారం, ముళ్లపొదలతో అస్తవ్యస్తం
- కుళాయిలు, మరుగుదొడ్ల పరిసరాలు జుగుప్సాకరం
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు, ఉద్యోగులు





అధ్వానంగా మరుగుదొడ్డి

ఎండిపోయిన మొక్కలు

దాదాపు అన్ని ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్, ప్రత్యేక రైళ్లకు హాల్ట్ ఉండడంతో దువ్వాడ రైల్వేస్టేషన్‌కు ప్రయాణికుల తాకిడి పెరిగింది. తూర్పు కోస్తా రైల్వే జోన్‌లో ఆదాయంతో పాటు ప్రయాణికుల రవాణాలో ముందుకు దూసుకుపోతుంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారంపై స్టేషన్ మాస్టర్‌కు గది కేటాయించలేదు. ఒకటో ప్లాట్‌ఫారం వెనుక భాగాన మూడో అంతస్తులోని ఎస్ఎస్ఐ కేబిన్‌కే పరిమితమవుతున్నారు. దీంతో స్టేషన్ ఆలనా పాలనా పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

నిధులు ఉన్నా నిర్లక్ష్యం!

స్టేషన్ నిర్వహణకు ప్రతీనెలా ఇంప్రెస్ గ్రాంట్ రూ.5వేల వరకు ఖర్చు చేసే అధికారం స్టేషన్ మేనేజర్‌కు ఉన్నా వాటి జోలికి వెళ్లడం లేదు. స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి కూడా ఈ నిధులు వెచ్చించవచ్చు.

సేవలకూ తిప్పలే..

ఒక వ్యక్తి ఆరుగురు కంటే ఎక్కువ మందికి రిజర్వేషన్ చేయించాలంటే సదరు వ్యక్తి రిజర్వేషన్ దరఖాస్తుపై ఎస్ఎంఆర్ సంతకం తప్పని సరిగా చేయించుకోవాలి. ఆయన సంతకం లేకపోతే ఆరుగురు కంటే ఎక్కువ మందికి రిజర్వేషన్ చేయడానికి సిబ్బంది నిరాకరిస్తున్నారు. రిజర్వేషన్ కౌంటర్‌కు దూరంగా మూడో అంతస్తులో ఎస్ఎస్ఐ కేబిన్‌లో ఉండడంతో ప్రయాణికులు మెట్ల మార్గంలో ఆయన కేబిన్‌కు వెళ్లి వచ్చేటప్పటికీ ఉన్న టికెట్లు కూడా అయిపోతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను కప్పేసిన పిచ్చిమొక్కలు



ప్లాట్‌ఫారం 4పై స్టీల్‌బెంచీ దుస్థితి



నాచుపట్టిన తాగునీటి కుళాయిల ఆవరణ

ఒక వైపు అభివృద్ధి పనులు... మరో వైపు నిరాదరణ

అమృత భారత్ కార్యక్రమంలో భాగంగా దువ్వాడ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ, సుందరీకరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అదనపు వసతులు సమకూరుతున్నాయి. మరోపక్క ఒకటి, నాలుగు ప్లాట్‌ఫారాల ప్రాంతాలు నిరాదరణకు గురవుతున్నాయి. ప్లాట్‌ఫారాలపై గ్రీనరీ కోసం ఏర్పాటు చేసిన మొక్కలు ఎండిపోయాయి. మరుగుదొడ్లలో ఫ్లష్ ట్యాంక్‌లు పనిచేయడం లేదు. రన్నింగ్ వాటర్ సమస్య ఉండడంతో దుర్గంధ భరితంగా మారాయి.

ఒకటో ప్లాట్‌ఫారం ముఖద్వారం నుంచి ఎస్ఎస్ఐ కేబిన్, పార్కింగ్ ప్రాంతంలో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు, చెత్తా చెదారం పేరుకుపోయి డంపింగ్‌యార్డును తలపిస్తుంది. ప్లాట్‌ఫారాలపై ఉన్న నీటి కుళాయిల పరిసరాలు నాచుపట్టిపోయాయి. దీంతో ప్రయాణికులు తాగునీటిని కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైల్వేస్టేషన్ అవసరాల కోసం ఏర్పాటు చేసిన ఓవర్‌హెడ్ ట్యాంక్ చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు గుబురుగా పెరిగిపోవడంతో ట్యాంక్‌ను ఎప్పటి నుంచో శుభ్రం చేయలేదని ప్రయాణికులు వాపోతున్నారు.

పట్టించుకోవడం లేదు



దువ్వాడ రైల్వేస్టేషన్ ఆవరణ మరీ ఇంత అధ్వానంగా ఎప్పుడూ చూడలేదు. ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు కంపుకొడుతున్నాయి. కుళాయిల చుట్టూ నాచు పేరుకుపోతుంది. ట్యాప్‌ల లీకేజీలు వల్ల ప్లాట్‌పారాలపైకి నీరు పారుతోంది. అధికారులు స్వచ్ఛతను గాలికి వదిలేశారు.

– బలిరెడ్డి నాగేశ్వరరావు, అగనంపూడి

స్టేషన్ మేనేజర్‌ను కలవాలంటే ఇక్కట్లు



ప్లాట్‌ఫారాన్ని ఆనుకొని ఉన్న గదుల్లో స్టేషన్ మేనేజర్‌కు గది కేటాయించకపోవడం ఉన్నతాధికారుల ఉదాసీనతకు దర్పం పడుతోంది. స్టేషన్ మేనేజర్‌కు ఫిర్యాదు చేయాలన్నా, రిజర్వేషన్ ఫారాలపై కౌంటర్ సైన్ చేయాలన్నా మూడు అంతస్తులు పైకి ఎక్కి వెళ్లాల్సి వస్తోంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతన్నారు.

– నక్కా రమణబాబు, బీసీకాలనీ

క్లుప్తంగా

విశేష పుష్పాలతో తిరుమలేశునికి అలంకరణ



విశేష అలంకరణలో శ్రీదేవి భూదేవి సహిత తిరుమలేశుడు

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుమలేశునికి శనివారం రాత్రి వరకు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సహిత వెంకటేశ్వరుడిని విశేష పుష్పాలతో అలంకరించారు. ఆదివారం కూడా విశేష అలంకరణలో ఉన్న తిరుమలేశుడిని భక్తులు దర్శించుకున్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



ఫైర్ స్టేషన్‌లో ప్రదర్శించిన సామగ్రి

పెదగంట్యాడ: అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారం రోజులుగా అనేక కార్యక్రమాలు నిర్వహించామని అగ్నిమాపక దళ జిల్లా సహాయ అధికారి గోపీకృష్ణ తెలిపారు. అగ్నిమాపక దళ వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఇందులో భాగంగా పెదగంట్యాడలోని ఫైర్ స్టేషన్‌లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని ఎలా రక్షించాలో చూపించారు. అలాగే మంటలు వ్యాపించకుండా చేపట్టాల్సిన చర్యలను వివరించారు. అగ్ని ప్రమాదాలను నివారించేందుకు ఉపయోగించే సామగ్రిని ప్రదర్శించారు. వాటి పనితీరును వివరించారు. కార్యక్రమంలో పెదగంట్యాడ అగ్నిమాపక దళ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

పెదగంట్యాడ: ఈస్టర్ వేడుకలను పెదగంట్యాడ జంక్షన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సీయోను ప్రార్థనా మందిరం పాస్టర్ కణితి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీతానగరం, పెదగంట్యాడ, నెల్లిముక్కు, చినకోరాడ మీదుగా శాంతి ర్యాలీ సాగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే తిప్పల గుర్నుమూర్తిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. పులి వెంకట రమణారెడ్డి, మార్టుపూడి పరదేశి, పెద్దాడ రమణ, కణితి మహేష్, ఈశ్వరరావు, రాజు, శంకరరావు, అప్పారావు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా బీఎస్ఎన్ఎల్ స్తంభం



తుప్పు పట్టి ప్రమాదకరంగా ఉన్న స్తంభం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు హరిజ నజగ్గయ్యపాలెంలో బీఎస్ఎన్ఎల్‌కు చెందిన స్తంభం తుప్పు పట్టి ప్రమాదకరంగా మారింది. ఇది ఎప్పుడు కూలిపోతుందోనని స్థానికులు భయాందోళన మధ్య తిరుగుతున్నారు. గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్ ఏరియాలో ఉన్న ఈ స్తంభానికి అనేక కేబుల్ వైర్లు కొనసాగుతున్నాయి. ఈ స్తంభం కింద భాగం పూర్తిగా తుప్పు పట్టి ఉంది. ఈదురుగాలుల సమయంలో ఈ పోల్ పడిపోయే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి స్తంభాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం



భక్తులకు తాళిబొట్టు చూపిస్తున్న పురోహితుడు

గాజువాక: పాతకర్ణవానిపాలెం రామాలయం నాలుగో వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అర్చకుల వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ వేడుక నిర్వహించారు. స్వామివారి వివాహోత్సవాన్ని తిలకించేందుకు శ్రీనగర్, అఫీషియల్ కాలనీ, భరత్‌నగర్, చినగంట్యాడ ప్రాంతాలనుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ అర్చకుడు రవికుమార్‌శర్మ పర్యవేక్షణలో అర్చక బృందం కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో వేలాదిమంది భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, కాలనీవాసులు సిరసపల్లి అప్పారావు, కరణం కనకారావు, గొంతిన దేముడు, సాలావు నూకరాజు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరంలో మేడే ఉత్సవాలు

ఉక్కునగరం: జీవీఎంసీ 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు, సీఐటీయూ, ఐద్వా ఆధ్వర్యంలో ఉక్కునగరంలో మేడే ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈనెల 25,26 తేదీల్లో పిల్లలకు, పెద్దలకు ఆటల పోటీలు నిర్వహించనున్నారు. త్రిష్నా మైదానంలో పిల్లలకు మధ్యాహ్నం 3 గంటలకు స్లో సైక్లింగ్, 100 మీటర్ల రన్నింగ్ రేస్, ఇన్ అవుట్ గేమ్, సెవెన్ స్టెప్స్, బెలూన్ బ్లోయింగ్ అండ్ బ్లాస్టింగ్ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. పురుషులు, స్త్రీలకు కిలోమీటరు నడక, ఇన్ అవుట్ గేమ్, సెవెన్ స్టెప్స్, ప్లేట్ అండ్ బ్యాంగిల్స్, బెలూన్ బ్లోయింగ్ అండ్ బ్లాస్టింగ్, స్ట్రా- థర్మోకోల్ బాల్, బకెట్ అండ్ బాల్‌త్రో, పజిల్స్, త్రెడ్ అండ్ నీడిల్, స్లో సైక్లింగ్ పోటీలు నిర్వహించనున్నారు. అదే విధంగా మే 1 నుంచి 5 వరకు సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఎం. గౌరీశంకరరావు (94946 12677), ఎ. కోటేశ్వరరావు (9493201754), వై. సువర్ణరాజు (99898 83376 లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి



మరిడిమాంబ ఆలయం వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

అగనంపూడి: సేవా కార్యక్రమాలతో సంతృప్తి లభిస్తుందని జననీ సోషల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు విందుల వెంకటరమణ అన్నారు. జీవీఎంసీ 79, 85 వార్డులకు చెందిన సత్యసాయి భజన మండలి (అగనంపూడి శాఖ) ఆధ్వర్యంలో కొండయ్యవలస మరిడిమాంబ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. 15 ఏళ్లుగా ఇక్కడ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో వేసవిలో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉక్కునగరం సత్యసాయి సేవా సమితి కన్వీనర్ జి.రామకృష్ణ, అగనంపూడి సత్యసాయి భజన మండలి అధ్యక్షుడు విందుల పైడినాయుడు, ప్రతినిధులు కేఎస్ఎన్‌రాజు, నాయుడు, విందుల రామారావు, ఎస్‌కేఆర్‌కేరాజు, రామన్, అల్లం శ్రీనివాసరావు, ప్రజా సంఘాల నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, గుదే సుశీలా గజేంద్రరావు, మడగల నరసింగరావు, కొల్లి జయ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు



పెదగంట్యాడ జంక్షన్‌లో మజ్జిగ పంపిణీ చేస్తున్న అసోసియేషన్ సభ్యులు



రైల్వేస్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

పెదగంట్యాడ: మండే ఎండల్లో బాటసారులకు ఉపశమనం కలిగించేందుకు మజ్జిగ అందజేస్తున్నామని నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్ 1998–99 టెన్త్ క్లాస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ మేరకు పెదగంట్యాడ జంక్షన్‌లో మజ్జిగ చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు.

కార్యక్రమంలో సిరిశెట్టి వెంకట శివ అప్పారావు, పిట్టా పైడిరెడ్డి, గొందేశి తాతారెడ్డి, అండి బోయిన అప్పలరాజు, దాసరి అప్పన్న రెడ్డి, మొల్లి వెంకటరమణ, ఉరుము తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ ప్రాంతంలో..

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ ఫ్లైఓవర్ వంతెన దిగువ భాగంలో కుసుమ హరనాథ ఆశ్రమం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. వారపు సంతకు వచ్చే వారితో పాటు ప్రయాణికుల సౌకర్యం కోసం కుసుమ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

అన్నమాచార్య సంకీర్తనలతో శ్రీనివాసుని కటాక్షం



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న అతిథులు

సీతంపేట: అన్నమాచార్య జయంతిని పురస్కరించుకుని శృతిలయ భక్తి సంగీత సేవా సంస్థ వ్యవస్థాపకుడు వి.ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో అన్నమాచార్య సంకీర్తనా పోటీలు నిర్వహించారు. కప్పరాడ వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయ అర్చకుడు జి.శేషాచార్యులు జ్యోతి వెలిగించి పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమాచార్య సంకీర్తనలు ఎవరైతే భక్తితో గానం చేస్తారో వారికి శ్రీనివాసుని కటాక్షం లభిస్తుందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు భక్తిని కూడా అలవర్చుకోవాలని సూచించారు. ఐదు విభాగాల్లో జరిగిన పోటీలో నగరానికి చెందిన 180 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథి వంకాయల సన్యాసిరాజు, సంస్థ గౌరవాధ్యక్షుడు కె.ఎ.రాజు, అధ్యక్షుడు వి.ప్రభాకర్, కార్యదర్శి ఎం.ఎస్.మాధవ్, కన్వీనర్ సి.హెచ్.వి.సత్యనారాయణ, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, కొణతాల రాజు, మేడా మస్తాన్‌రెడ్డి, వి.నాంచారయ్య, పీవీఎస్‌వీ ప్రసాద్, అరుణకాంత్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శనలో చిన్నారులు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాలలో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు శిల్పారామంలో జరిగిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. జ్యోష్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం బుజ్జి గణపతి నృత్యాంశంతో ప్రారంభమైంది. జై జనార్ధన, ఐగిరి నందిని నృత్య రూపకాలు ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఈఏపీ, పాలిసెట్‌లకు ఉచిత శిక్షణ

గాజువాక: స్థానిక చైతన్యనగర్‌లోని శ్రీసూర్య జూనియర్ కళాశాలలో ఈఏపీ సెట్, పాలిసెట్‌లకు ఉచిత శిక్షణను ప్రారంభించారు. ఆరేళ్లుగా ఉచితంగా అందిస్తున్నామని అధ్యాపకులు గుడివాడ శ్రీనివాసరావు, రాజశేఖర్ తెలిపారు. పాలిసెట్ కోచింగ్ ఈనెల 30వరకు, ఈఏపీ సెట్ కోచింగ్ వచ్చేనెల 15 వరకు కొనసాగుతాయని చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వివరాల కోసం 9912278589 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

ఉద్యోగులకు అండగా ఏఐబీఈఏ పోరాటాలు



ఏఐబీఈఏ రూపకర్తలకు నివాళులర్పిస్తున్న నాయకులు

డాబాగార్డెన్స్: జిల్లా బ్యాంక్ ఉద్యోగ సమన్వయ సంఘం ఆధ్వర్యంలో ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) 80వ వ్యవస్థాపక దినోత్సవం ఆదివారం డాబాగార్డెన్స్‌లోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఎల్ఐసీ బ్రాంచ్ వద్ద ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐబీఈఏ నాయకులు కోటేశ్వరరావు, సాత్యకి ప్రసాద్, శంకరరాజు, వసంతరావులు జెండాను ఎగురవేశారు. అనంతరం ఏఐబీఈఏ రూపకర్తలైన ప్రభాత్కర్, పర్వానా, తారకేశ్వర్ చక్రవర్తి , చెడ్డా చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఏఐబీఈఏ యూనియన్ ఏర్పడిన చారిత్రక నేపథ్యం, ఇప్పటివరకు జరిగిన ముఖ్యమైన సంఘటనలు, యూనియన్ గొప్పతనాన్ని వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడా పోటీలలో విజేతలైన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఈత ప్రసాద్, ఆదారి శ్రీను, ఈశ్వర్, రమేష్, పి.ఎస్. రావు, గురుమూర్తి, రవి, స్వాతితో పాటు పలువురు బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సీపీఎం నాయకుల సర్వే



సమస్యలు తెలుసుకొంటున్న సీపీఎం నాయకులు

గాజువాక: వివిధ ప్రాంతాల్లో ప్రజా సమస్యలపై సీపీఎం నాయకులు ఆదివారం సర్వే నిర్వహించారు. ప్రజా సంకల్ప యాత్ర పేరిట 67వ వార్డు పార్టీ కమిటీ ఆధ్వర్యంలో జోగవానిపాలెం, విద్యుత్ సబ్ స్టేషన్ పశ్చిమ భాగం, బొజ్జన్న కొండ తూర్పు భాగంలో నివాసులను కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు తమకు అందడం లేదని, నిత్యావసర సరకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, విద్యుత్ చార్జీల సమస్యలతోపాటు ఏడాదికి మూడు సిలిండర్ల సబ్సిడీ సొమ్ము రిఫండ్ రావడంలేదని ప్రజలు వాపోయారు. తల్లికి వందనం కింద డబ్బులు రావడం లేదని నివాసులు వివరించినట్టు సీపీఎం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కె.కిరీటం, కె.సంతోషం, కె.ప్రతాప్ కుమార్, కల్యాణి, కృష్ణ కుమారి, లోకేష్, శ్రీనివాస్, లక్ష్మణస్వామి తదితరులు పాల్గొన్నారు.

హద్దు మీరితే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఫోర్త్‌టౌన్ ఎస్ఐ చిన్నంనాయుడు

సీతమ్మధార: సమాజంలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రౌడీషీటర్లను ఫోర్త్‌టౌన్ ఎస్ఐ చిన్నంనాయుడు హెచ్చరించారు. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు, సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు నేర నియంత్రణకు కృషి చేస్తున్నామన్నారు. మద్యం షాపుల వద్ద చిందులేసినా, గొడవలు చేసిన ఊరుకునేది లేదన్నారు. మంచిగా ఉండాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్లపై ఎల్లప్పుడూ పోలీస్ నిఘా ఉంటుందని, సత్ప్రవర్తనలో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మంచిగా జీవించండి

ద్వారకా పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఎస్ఐ శ్రీను కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా, మంచిగా జీవించాలని సూచించారు. హద్దు మీరి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుడి ఆత్మహత్య

పీఎం పాలెం: పీఎం పాలెం సెకండ్ బస్టాప్ సమీపంలోని తిరుమల అపార్ట్‌మెంట్‌లోని నాలుగో అంతస్తులో నివసిస్తున్న దివ్యాంగుడు నియమాన సుభాష్ చంద్రబోస్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను పీఎం పాలెం సీఐ బాలకృష్ణ మీడియాకు తెలిపారు. సుభాష్ చంద్రబోస్ తండ్రి 2023లో మృతి చెందగా, తల్లి, సోదరుడు కూడా గతంలో చనిపోయారు. దీంతో చంద్రబోస్ ఒంటరిగా జీవిస్తున్నారు. సుభాష్ చంద్రబోస్‌కు శ్రీకాకుళానికి చెందిన ధనుంజయరావు అనే స్నేహితుడు ఉన్నాడు. వారిద్దరూ తరచూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. ఆదివారం ఉదయం ధనుంజయరావు సుభాష్ చంద్రబోస్‌కు ఫోన్ చేయగా, ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉంది. ఎంత ప్రయత్నించినా ఫోన్ కలవకపోవడంతో అపార్ట్‌మెంట్ ఓనర్‌కు సమాచారం అందించాడు. అపార్ట్‌మెంట్ ఓనర్ వాచ్‌మన్‌కు తెలియజేయగా, ఆదివారం మధ్యాహ్నం 1 గంటల సమయంలో కొంతమంది అపార్ట్‌మెంట్ వాసులు బలవంతంగా తలుపులు తెరిచి చూడగా, సుభాష్ చంద్రబోస్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు.

వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో మృతుడు గతంలో కూడా ఆత్మహత్యా ప్రయత్నం చేశాడని తేలింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతుని స్నేహితుడు ధనుంజయరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయోజనకరంగా పరిశోధనలు



రక్షితకు డాక్టరేట్ అందిస్తున్న వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: పరిశోధనలు సమాజానికి మేలు చేసేలా యూనివర్సిటీ ఆచార్యులు, విద్యార్థులు మరింత సాధన చేయాలని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థిని టీకే జయరక్షితకు ఏయూ డాక్టరేట్ లభించింది. వీసీ చేతుల మీదుగా ఆమె పీహెచ్‌డీ పట్టా పొందారు. 'ఏ హోలిస్టిక్ అనాలసిస్ ఆఫ్ బనానా ఫైబర్–రీన్ ఫోర్స్‌డ్ సస్టైనబుల్ కాంక్రీట్ ఆఫ్ ఎం 25, అండ్ ఎం 35' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ అందుకున్నారు. ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగ ప్రొఫెసర్ ఆచార్య ఎస్.ఆదిశేషు పర్యవేక్షణలో ఆమె పరిశోధనలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆదివారం ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జయ రక్షితను విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.